## క్లుప్తంగా

### రెండో రోజూ కొనసాగిన తనిఖీలు



యాదమరిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**యాదమరి(కాణిపాకం):** యాదమరి మండలంలోని పలు ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు జిల్లా వ్యాప్తంగా రెండో రోజు కొనసాగుతున్నాయి. పుంగనూరు సహాయకులు శివకుమార్, తవణంపల్లె మండల అధికారి ప్రవీణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందులు, నిల్వలు, ధరల పట్టిక తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. దుకాణదారులు తప్పనిసరిగా కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వాలని, అధిక ధరలకు విక్రయించరాదని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### గ్రామీణులకు వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

**గుడిపాల:** గ్రామీణులందరికీ వైద్యసేవలు అందజేస్తున్నట్లు బొమ్మసముద్రం ప్రాథమిక వైద్యాధికారి అనూష తెలిపారు. మండలంలోని 197 రామాపురంలో శుక్రవారం 104 వాహనం ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచానపడ్డ రోగుల ఇంటివద్దకే వెళ్లి వైద్యం చేస్తున్నట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా రక్తపరీక్షలు నిర్వహించి వారికి ఉచితంగా మందులను అందజేస్తామన్నారు. షుగర్, బీపీ, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారికి చికిత్సలు చేసి నెలకు అవసరపడే మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది సరస్వతి, సుభాషిణి, దివ్య, అశ్విని, శశి తదితరులు పాల్గొన్నారు.

### గొడుగు చింతకు ఆర్టీసీ సర్వీసులు

**పూతలపట్టు (కాణిపాకం):** పూతలపట్టు మండలం గొడుగుచింత గ్రామానికి శుక్రవారం ఆర్టీసీ కొత్త సర్వీసును ప్రారంభించింది. ఈ సర్వీసును గ్రామంలో ఎమ్మెల్యే మురళీమోహన్ చేతులమీదుగా ఆర్టీసీ అధికారులు పూజలు చేసి ప్రారంభోత్సవం చేశారు. గతంలో రెండు సర్వీసులుంటే ఇప్పుడు ఏడు సర్వీసులకు పొడిగించామని, ప్రయాణికులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

### నాణ్యమైన ఎరువులు సరఫరా చేయాలి



అరగొండలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

**తవణంపల్లె:** రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుల మందులు సరఫరా చేయాలని వ్యవసాయ శాఖ ఏడీ శివకుమార్ డీలర్లను ఆదేశించారు. మండలంలోని అరగొండలో శుక్రవారం ఎరువులు, పురుగు మందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో ఎరువులు, పురుగు మందులకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. దుకాణాల వద్ద ఎరువులు, పురుగు మందులకు సంబంధించి స్టాక్‌ను, ధరల పట్టికను నోటీస్ బోర్డులో దుకాణం బయట ఉంచాలని ఆదేశించారు. ఎరువులు, పురుగు మందులు కొన్న రైతులకు విధిగా బిల్లులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో తవణంపల్లె వ్యవసాయాధికారి జి. ప్రవీణ్ పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



దండువారిపల్లెలో వైఎస్సార్ వీరాభిమానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**బంగారుపాళెం:** మండలంలోని చీకూరుపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బన్నీ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారమందుకున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు కిషోర్‌రెడ్డి, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు నాగరాజ, స్థానిక ఎంపీటీసీ స్వాతి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కల్లూరుపల్లె సర్పంచ్ బాలాజీ, కేఎం కండ్రిగ ఉపసర్పంచ్ కుట్టి, నాయకులు భాను ప్రకాష్‌రెడ్డి, కమలాపతిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, శైలేష్ తదితరులు కలిసి శుక్రవారం బన్నీ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మండలంలోని దండువారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ వీరాభిమాని దొరస్వామి మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని నాయకులు సందర్శించి నివాళులర్పించారు.

# పత్రాలు.. పడిగాపులు!

- మొరాయిస్తున్న రెవెన్యూ సేవలు
- పని చేయని మీ–సేవ వెబ్‌సైట్
- అనుమతి లేని అర్బన్ కీ



పేరుకుపోయిన అర్జీలు



తహసీల్దార్ కార్యాలయం

**చిత్తూరు రూరల్ (కాణిపాకం):** రెవెన్యూ సేవలు మొరాయిస్తున్నాయి. మీసేవ వెబ్‌సైట్ పూర్తిగా పని చేయడం లేదు. అర్బన్ కీ నెలన్నరగా మొరాయిస్తోంది. దీంతో పలు రకాల పత్రాలు కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. పత్రాల కోసం పడిగాపులు కాస్తున్నారు. దీంతో ప్రభుత్వం తీరుపై క్షేత్రస్థాయిలో విమర్శలు వెలువెత్తుతున్నాయి. చిత్తూరు అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలకు నిత్యం వందలాదిమంది రాకపోకలు సాగిస్తుంటారు. కుల, ఆదాయ ధృవపత్రాలతో పాటు భూపట్టా దారు పుస్తకాల్లో పేర్ల మార్పులు, ఇతరత్రా సమస్య అధికంగా కార్యాలయాన్ని ఆశ్రయిస్తుంటారు. అయితే గత 15 రోజులుగా మీసేవ వెబ్‌సైట్‌లు పనిచేయడం లేదు. దీంతో వివిధ రెవెన్యూ సేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండాపోయింది. ఆన్‌లైన్, సచివాలయాల చుట్టూ ప్రజలు ఈ సేవలు పొందేందుకు ప్రదక్షిణలు చేస్తున్నారు. వెబ్‌ల్యాండ్ సైతం పనిచేయకపోవడంతో భూ పత్రాల కోసం భూ హక్కుదారులు అల్లాడిపోతున్నారు.

**పనిచేయని అర్బన్ కీ**

రెండు నెలల క్రితం అర్బన్, రూరల్ తహసీల్దార్ కార్యాలయాలుగా విభజించారు. పరిపాలన సౌలభ్యం కోసం ఇద్దరు తహసీల్దార్లకు అధికార హక్కులను కేటాయించారు. ఈ క్రమంలో తొలుత రూరల్ కార్యాలయానికి కీ అనుమతులొచ్చాయి. అయితే అర్బన్‌కు మాత్రం నెలన్నర రోజులుగా కీ పనిచేయకుండా వేధిస్తోంది. దీంతో అనుమతి రాకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రధానంగా కుల, ఆధాయ ధృవీకరణ పత్రాలు కుప్పలు తెప్పలుగా వచ్చి పడ్డాయి. మొత్తం 236 వరకు దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అత్యవసరంగా పత్రాలు కావాల్సిన వారు చాలా ఇబ్బంది పడుతున్నారు. కీ అనుమతి రాక పలు రకాల సేవలు పూర్తిగా స్తంభించాయి. మరో రెండు రోజుల పాటు కీ సమస్య తప్పదని కార్యాలయ సిబ్బంది చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రెవెన్యూ సేవలు సులభతరంగా అందేవి. వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి ప్రజా సమస్యలను పరిష్కరించడంతో పాటు సేవలకు అందించేవారు. కుల, ఆదాయ పత్రాలను ఏడు రోజుల్లో ఇచ్చేవారు. భూ పట్టా మార్పులు, ఇతరత్రా సేవలు నిర్ణీత సమయంలో జరిగేవి. ఇప్పుడు మొత్తం తలకిందులైపోయింది. అసలు సమస్య తెలియజేయడానికి కూడా వెబ్‌సైట్ ఓపెన్ కావడంలేదు. దీంతో ప్రజలందరూ తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక అవస్థలు పడుతున్నారు.

### చెత్త సేకరణ కోసం ఎలక్ట్రిక్ ఆటో



చెత్త సేకరణ కోసం ఎలక్ట్రిక్ ఆటోను ప్రారంభిస్తున్న రజనీకాంత్

**గుడిపాల:** చెత్తసేకరణ కోసం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లేందుకు ఎలక్ట్రిక్ ఆటోను ప్రారంభించినట్లు వసంతాపురం సర్పంచ్ రజనీకాంత్ తెలిపారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందితో కలిసి ఆటోను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్తను ఇకపై గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి సేకరించనున్నట్లు వివరించారు. గ్రామాల్లోని వీధుల్లో ఎక్కడా కూడా చెత్తను వేయకుండా ఇంటిలోని ప్లాస్టిక్ డబ్బాల్లో వేసుకోవాలని సూచించారు. ప్రతి రెండు రోజులకోసారి ఇంటివద్దకే ఆటో వస్తుందన్నారు. దీనివల్ల పర్యావరణాన్ని కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుందరేషన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ బబిత, మహిళా పోలీస్ పావని, డిజిటల్ అసిస్టెంట్ రవీంద్రబాబు, ఏఎన్ఎం సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

## చెత్త కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలి



నిరుపయోగంగా ఉన్న చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ ధనలక్ష్మి

**ఐరాల:** మండలంలోని ముదిగోళం చెత్త సంపద కేంద్రాన్ని త్వరితగతిన వినియోగంలోకి తీసుకురావాలని పంచాయతీ కార్యదర్శికి ఎంపీడీఓ ధనలక్ష్మి ఆదేశించారు. మండలంలోని ముదిగోళంలో శుక్రవారం నిరుపయోగంగా ఉన్న ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును సందర్శించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో వీధులు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని తెలిపారు. ప్రతి ఇంటిలో గ్రీన్ అంబాసిడర్స్ తడి, పొడి చెత్తను సేకరించి కేంద్రాన్ని తరలించి వర్మీకంపోస్టు ఎరువులు తయారు చేయాలన్నారు. చెత్త సేకరణ ద్వారా గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగు పరచడంతో పాటు చెత్త నుంచి తయారు చేసిన ఎరువుల విక్రయం ద్వారా ఆదాయం పొందవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## టి.పుత్తూరులో స్వచ్ఛభారత్



పారిశుధ్య పనుల్లో అపోలో నర్సింగ్ కళాశాల విద్యార్థులు

**తవణంపల్లె:** మండలంలోని టి.పుత్తూరులో అరగొండ అపోలో నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులచే స్వచ్ఛ భారత్ పనులు చేపట్టారు. జాతీయ సేవా పథకం కింద ఎన్ఎస్ఎస్ విద్యార్థులు(వలంటీర్లు) శ్రీ కోదండరాముల గుడి ఆవరణలో చెత్త, గడ్డి, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేయించారు. వీధులను శుభ్రం చేయించి, మొక్కలు నాటించారు. పచ్చని చెట్లు ప్రగతికి మెట్లని సూచించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పోషించి పర్యావరణాన్ని కాపాడాలని విద్యార్థులు ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శోభారాణి, విద్యార్థులు, సర్పంచ్ రవిచంద్రారెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలి



అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు

**ఐరాల:** గ్రామ సచివాలయ ఉద్యోగులు చిత్తశుద్ధితో పనిచేయాలని, సమయపాలన పాటించాలని జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు సూచించారు. మండలంలోని ముదిగోళం సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పట్టిక, రికార్డులను తనిఖీ చేశారు. ప్రజా సేవలపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. బయోమెట్రిక్ హాజరును తప్పక వేయాలని సూచించారు. సంక్షేమ, అభివృద్ధి ఫలాలను ఎప్పటికప్పుడు అర్హులైన పేదలకు చేరవేయవలసిన ప్రధాన బాధ్యత సచివాలయ ఉద్యోగులదే అన్నారు. విధి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కార్యదర్శికి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, మూడేళ్లలోపు చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహార రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి మధు పాల్గొన్నారు.

## రాజకీయ కుట్రతోనే పెద్దిరెడ్డిపై తప్పుడు ప్రచారం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్

**బంగారుపాళెం:** రాజకీయ కుట్రతోనే సీఎం చంద్రబాబు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తప్పుడు ప్రచారాలు సాగిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని డాక్టర్ సునీల్‌కుమార్ మండిపడ్డారు. మండలంలోని మొగిలివెంకటగిరిలో శుక్రవారం వైస్‌ఎంపీపీ శిరీష్‌రెడ్డి నివాసగృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డిపై రాజకీయ కక్షతోనే చంద్రబాబు అక్రమ కేసులు పెడుతున్నారని ఆరోపించారు. 20 ఏళ్ల క్రితం చట్టబద్ధంగా కొనుగోలు చేసిన భూములను కబ్జా చేశారంటూ ఎల్లో మీడియా ద్వారా తప్పుడు ప్రచారాలు సాగించడం దారుణమని ఖండించారు. బాబు అధికారం చేపట్టి ఎనిమిది నెలలు కావస్తున్నా ప్రజలకు ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను సక్రమంగా అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సంక్షేమ పథకాలు అమలుపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఎక్కడ నిలదీస్తారోనని డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్‌సీపీపై ద్వేషంతో కుట్ర రాజకీయాలు చేస్తున్నారన్నారు. పెద్దాయనపై చేస్తున్న ఆరోపణలన్నీ అసత్యాలేనని కొట్టిపారేశారు. వైఎస్సార్‌సీపీ పేదల సంక్షేమానికి పాటుపడే పార్టీనని అన్నారు. ప్రజల కోసం నిరంతర పోరాటాలకు సిద్ధమన్నారు. బెదిరింపు రాజకీయాలకు భయపడేదిలేదని స్పష్టం చేశారు. మండల పార్టీ కన్వీనర్ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ, పెద్దిరెడ్డిని లక్ష్యంగా చేసి వైఎస్సార్‌సీపీని బలహీన పరచాలనే లక్ష్యంతో చంద్రబాబు నీచ రాజకీయాలు చేస్తున్నారన్నారు. శిరీష్‌రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వ అన్యాయాలపై ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులపై కేసులు పెడతారా అని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కిషోర్‌కుమార్ రెడ్డి, నాగరాజు, ప్రకాష్, శైలేష్, బాలాజీ, మురళి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి



పల్లెచెరువులో గర్భిణికి వైద్య సేవలందిస్తున్న డాక్టర్ కేశవనారాయణ

**తవణంపల్లె:** గ్రామాల్లో శానిటేషన్ పనులు చేపట్టాలని డాక్టర్ కేశవనారాయణ తెలిపారు. మండలంలోని పల్లెచెరువు, గోవిందరెడ్డిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. పల్లెచెరువులో డాక్టర్ కేశవనారాయణ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గోవిందరెడ్డిపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ 30 మంది రోగులకు పరీక్షలు చేయించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. చలికాలంలో కాచి చల్లార్చిన వేడి నీరు తాగాలన్నారు. దోమకాటుకు గురికాకుండా దోమ తెరలు వాడాలని చెప్పారు. 104, 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## రోడ్డు పనులకు మరోసారి మార్కింగ్



మార్కింగ్ పనులు చేస్తున్న ఏసీపీ, సిబ్బంది

**చిత్తూరు అర్బన్:** చిత్తూరు నగరంలో రోడ్డు విస్తరణ పనులకు సంబంధించి అధికారులు శనివారం మరోసారి మార్కింగ్ ప్రారంభించారు. కట్టమంచి నుంచి కలెక్టరేట్ వరకు మాస్టర్ ప్లాన్ ప్రకారం వంద అడుగుల వెడల్పుతో రోడ్డు విస్తరణ చేయాల్సి ఉంది. ఇప్పటికే కార్పొరేషన్ అధికారులు ఎంఎస్‌ఆర్ కూడలి నుంచి కలెక్టరేట్ వరకు మార్కింగ్ పనులు పూర్తి చేశారు. ఇక కట్టమంచి నుంచి ఎంఎస్‌ఆర్ వరకు వంద అడుగుల మేరకు రోడ్డు విస్తరణ చేయడానికి అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర ఆధ్వర్యంలో సిబ్బంది మార్కింగ్ పనులు చేస్తున్నారు. ఇది పూర్తయిన తరువాత ప్లాన్ రూపొందించి ఆపై కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

## 3015 పశువులకు వైద్య సేవలు



పశువైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

**గుడిపాల:** గత పది రోజులుగా నిర్వహించిన పశువైద్య శిబిరంలో 3015 పశువులకు చికిత్సలు నిర్వహించినట్లు పశువైద్యాధికారి సాయిసుధ అన్నారు. కొత్తకోట గ్రామంలో శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 20వ తేదీ నుంచి 31వ తేదీ వరకు 3015 పశువులకు చికిత్సలు నిర్వహించామన్నారు. పాలదిగుబడి బాగా రావాలంటే పరిసరాలన్నీ శుభ్రంగా ఉంచుకోవడంతోపాటు పశువులకు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏవైనా పశువులకు వ్యాధులు సంభవించినప్పుడు వెంటనే పశువైద్య సహాయకులను సంప్రదించాలని చెప్పారు. కొత్తకోట గ్రామంలో 134 పశువులకు చికిత్సలు నిర్వహించారు. అనంతరం డీవార్మింగ్, పిడుదుల నివారణ మందు స్ప్రే నిర్వహించారు.

## కత్తెరపల్లెలో క్యాన్సర్ స్క్రీనింగ్



వైద్యాధికారులతో వైఎస్సార్‌సీపీ నేతలు

**కార్వేటినగరం:** మండలంలోని కత్తెరపల్లెలోని రైతు సేవాకేంద్రంలో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్వీ మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో చేపట్టిన శిబిరంలో వైద్యాధికారులు భువనేశ్వరి, హేమశ్రీ మాట్లాడుతూ తొలిదశలోనే గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయవచ్చని తెలిపారు. పీహెచ్‌సీల్లో సైతం క్యాన్సర్‌కు చికిత్స అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలో 105 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, డాక్టర్ ఉమాదేవి, డాక్టర్ తేజశ్విని, డాక్టర్ హిమబిందు, సీహెచ్‌ఓ రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరి, విస్తరణాధికారి త్యాగు పాల్గొన్నారు.



### క్యాలెండర్ ఆవిష్కరణ

**చిత్తూరు కలెక్టరేట్:** విద్యార్థులకు బాధ్యతతో నాణ్యమైన విద్యనందించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. కలెక్టర్ చేతుల మీదుగా శుక్రవారం నోబెల్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్, డైరీలను ఆవిష్కరింపజేశారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులతో కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి ప్రభుత్వ బడుల పురోగతికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జయప్రకాష్‌నాయుడు, అసోసియేట్ అధ్యక్షులు దేవకి, ఇతర నాయకులు రుక్మానంద, బాబు, పరంధామ, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంత వీఏఓ మృతి



రఘునాథరెడ్డి(ఫైల్)

**బంగారుపాళెం:** మండలంలోని జిల్లేడుపల్లెకు చెందిన విశ్రాంత వీఏఓ రఘునాథ రెడ్డి (92)శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. వృద్ధాప్య సమస్యల కారణంతో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన మృతి పట్ల పలువురు రెవిన్యూ అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. వీఏఓగా ఆయన చేసిన సేవలను గుర్తుచేశారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డైరీ ఆవిష్కరిస్తున్న డీఈవో వరలక్ష్మి

**చిత్తూరు కలెక్టరేట్:** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్ ప్రైమరీ అసోసియేషన్ (ఆప్టా) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లక్ష్మీపతి, మునాఫ్ అన్నారు. ఈ మేరకు ఆ సంఘం నాయకులు శుక్రవారం డీఈవో వరలక్ష్మి చేతుల మీదుగా నూతన క్యాలెండర్, డైరీ ఆవిష్కరింపజేసి వినతిపత్రం అందజేశారు. డీఈవోతో ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు త్వరితగతిన చేపట్టాలన్నారు. సీనియారిటీ జాబితాలను పకడ్బందీగా సిద్ధం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అన్సర్, శంకర్‌రెడ్డి, యమున పాల్గొన్నారు.

## 3న మండల సర్వసభ్య సమావేశం

**గుడిపాల:** మండల సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివరాజన్ తెలిపారు. ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహిస్తామన్నారు. అన్ని శాఖల అధికారులు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి వివరాలతో తీసుకురావాలని చెప్పారు. దీనికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరుకావాలన్నారు.

# అందని బిల్లులు.. ఆగిన పనులు



పేయనపల్లెలో ఆగిన సచివాలయ భవన నిర్మాణ పనులు



బసవాపల్లెలో అసంపూర్తిగా ఉన్న సచివాలయ భవన నిర్మాణం

**గుడిపాల:** గ్రామ స్వరాజ్య సాధనలో భాగంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ప్రభుత్వ సేవలన్నీ గ్రామస్థాయిలోనే అందించాలనే ఉద్దేశంతో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణకు పక్కా భవనాల నిర్మాణాలు సైతం చేపట్టారు. పలుచోట్ల భవనాలు పూర్తయ్యాయి. మరి కొన్ని చోట్ల అసంపూర్తిగా మిగిలాయి. కూటమి ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలవుతున్నా నిర్మాణాలు పూర్తి చేయడంపై దృష్టి సారించడం లేదు. నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయి దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. మండలంలోని 17 గ్రామ సచివాలయాలకు గాను 12 సచివాలయ భవనాలు మాత్రమే పూర్తయ్యాయి. మిగిలిన 5 చోట్ల అర్ధంతరంగా పనులు నిలిచిపోయాయి. మండలంలోని బసవాపల్లె, పేయనపల్లె, ఏఎల్‌పురం, చిత్తపార గ్రామాల్లో పనులు ఆగిపోయాయి. నాడు ఒక్కో భవన నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.42లక్షల చొప్పున మంజూరు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వీటి నిర్మాణాలను గాలికొదిలేసింది. నిర్మాణాలు పూర్తయిన వాటిని పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. భవన నిర్మాణాల పనులు ఎన్నటికి పూర్తవుతాయని సంబంధిత అధికారులను ప్రశ్నించగా, ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైతే పెండింగ్ పనులు పూర్తిచేసి భవనాలను వినియోగంలోకి తీసుకువస్తామని పంచాయతీ రాజ్ ఇంజినీర్లు సమాధానమిస్తున్నారు.